క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ ద్వారా డ్రాపౌట్స్‌కు అవకాశం

మద్దిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరి మధ్యలో మాని వేసిన విద్యార్థులకు మంచి అవకాశం కల్పిస్తుందని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన ఆచార్యులు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్‌లో చేరి మాని వేసిన విద్యార్థులు, ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసేందుకు ఇంటర్‌మీడియెట్ బోర్డు ప్రిన్సిపాల్స్ ద్వారా అనుమతిని ఇచ్చిందని తెలిపారు. కాబట్టి ఇంటర్ మొదటి సంవత్సరం చేరి మాని వేసిన విద్యార్థులు ఈనెల 27 లోగా కళాశాల ప్రిన్సిపాల్‌ను కలవాలని తెలిపారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



దంత పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

చీమకుర్తి: ఎస్‌కేఆర్ మానసిక వికాసకేంద్రంలోని బధిరుల పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచిత దంత వైద్యపరీక్షలను నిర్వహించారు. విజయ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. ప్రతి రోజూ ఉదయం, రాత్రి పూట దంతాలను శుభ్రం చేసుకోవడంలో అవసరమైన సూచలను తెలియజేశారు. విద్యార్థులకు పేస్ట్‌లు, బ్రష్‌లు, మౌత్‌వాష్‌లను ఉచితంగా అందించారు. పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లు 1409

కొత్తపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు ఓట్లు 1409, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 76 ఉన్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. ఓటర్ లిస్టు విడుదల చేశామని తమ ఓటు ఉందా లేదా చూసుకోవల్సిందిగా కోరారు. రానివారు తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవాల్సిందిగా చెప్పారు. కొత్తపట్నంలో ఉన్న బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు.

క్రీడాకారులకు బహుమతులు



క్రీడాకారులకు బహుమతులందిస్తున్న సందిరెడ్డి వెంకటేశ్వరరావు

చీమకుర్తి: పేర్నమిట్ట బీవీ సుబ్బయ్య పాఠశాలలో బుధవారం నిర్వహించిన పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పాఠశాల సలహాదారులు సందిరెడ్డి వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ బొడ్డు కోట్లింగం చేతుల మీదుగా బహుమతులను అందించారు. పాఠశాల వ్యవస్థాపకులు బీవీ సుబ్బయ్య జయంతి సందర్భంగా పాఠశాలలో క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడలలోను రాణించాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రయోగ పరీక్షలు

మద్దిపాడు: స్థానిక రాఘవ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రయోగ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎల్ఎండీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులకు సంబంధించిన ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ బోడేపాగు కొండయ్య తెలిపారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించామని తెలిపారు. మొదటి సంవత్సరం 100 విద్యార్థులకు గాను 89 హాజరయ్యారు. ఇంటర్ రెండో సంవత్సరం 40 మందికి గాను 39 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

అభివృద్ధికి చిరునామా

- వేగంగా సచివాలయ భవన నిర్మాణాలు
- హెల్త్ క్లినిక్‌లు, ఆర్‌బికేలు కూడా..



చేజర్లలో ప్రారంభమైయిన సచివాలయ భవనం

ఒంగోలు రూరల్: మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ పటిష్టం చేసేందుకు సచివాలయ భవనాలు రూపకల్పన ప్రారంభించింది. ఇందులో భాగంగా పాలనా వ్యవస్థకు సచివాలయ భవనం రైతు సంక్షేమం ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు పాటించాల్సిన పద్ధతులు, వాతావరణ సూచనలు రైతులకు వెంటనే తెలియజేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడేందుకు గాను రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం చేపట్టారు. ప్రజానీకం ఆరోగ్యంగా ఉండేందుకు గ్రామ వెల్‌నెస్ సెంటర్‌లు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో భవనానికి లక్షలాది రూపాయిలు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. యరజర్ల, చేజర్ల సచివాలయాలను ఆయా గ్రామ సర్పంచులు కార్యదర్శుల సహకారంతో వేగంగా పూర్తిచేయడంతో రీజనల్ కోఆర్డినేటర్ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి యరజర్ల సచివాలయాన్ని, చేజర్ల సచివాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మాణం మోడల్ నిర్మాణంగాను రూపుదిద్దుకుంది. రైతు భరోసా కేంద్రం రూ.21.80 లక్షలతో పూర్తిస్థాయిలో పూర్తయింది. హెల్త్ సెంటర్ రూ.17.50 లక్షలతో నిర్మాణంలో ఉంది. చేజర్లలో సచివాలయ భవనం పూర్తిస్థాయి ప్రభుత్వ డిజైన్‌తో రూపుదిద్దుకుంది. గుండాయపాలెం సచివాలయం రూ.40 లక్షల వేయంతో నిర్మాణంలో ఉండగా ఆర్‌బీకే రూ.21 లక్షలు ఎస్టిమేషన్ కాస్ట్‌తో నిర్మాణంలో ఉంది. హెల్త్ క్లినిక్ రూ.17.50 ఎస్టిమేషన్ కాస్ట్‌తో నిర్మాణంలో ఉంది. సర్వేరెడ్డిపాలెం సచివాలయ భవనాలు కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో ప్రారంభానికి నోచుకోలేదు. కరవదిలో సచివాలయ భవన నిర్మాణం రూ.40 లక్షలు కాగా.. మరికొన్ని రోజుల్లో ఫినిషింగ్ వర్క్ పూర్తికానుంది. చేజర్లలో రూ.25 లక్షల వేయంతో రీమోడలింగ్ చేసిన సచివాలయ భవనాన్ని బాలినేని ప్రారంభించారు. ఆర్‌బీకే రూ.17 లక్షలతో పూర్తిస్థాయిలో పూర్తయింది. వెల్‌నెస్ సెంటర్ రూ.11 లక్షల వేయంతో ఫినిషింగ్ వర్క్ జరుగుతోంది. గుండాయపాలెంలో సచివాలయ భవన నిర్మాణాలు ఉలిచిలో సచివాలయ భవన నిర్మాణాలు కరవది-1 సచివాలయ భవన నిర్మాణాలు పిల్లర్స్ వేసి శ్లాబ్ దశలో పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. చింతాయగారిపాలెంలో స్థలం కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో ఆదే శాల కోసం ఎదురు చూస్తున్నారు. దశరాజుపల్లెలో సచివాలయ భవనం పూర్తయింది. త్వరలో ఫినిషింగ్ వర్క్ పూర్తికానుంది.



యరజర్ల లో పూర్తయిన సచివాలయ భవనం



చేజర్లలో పూర్తవుతున్న రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్



కరవది సచివాలయ భవనం

కొనుగోళ్లకు వేళాయే..!

- రేపటి నుంచి కొండపిలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం
- 9.89 మిలియన్ కేజీల పొగాకు అమ్మకానికి అనుమతి
- ధరలపైనే రైతుల గంపెడాశ

కొండపి: కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తామని వేలంకేంద్రం అధికారి ఎస్ రామారావు తెలిపారు. రైతులకు 2023 పంట కాలానికి సంబంధించి ఈ సంవత్సరం పొగాకు బోర్డు 9.89 మిలియన్ కేజీల అమ్మకాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. తేలిక నేలల్లో సాగు చేసిన బ్యారన్‌కి 36.50 క్వింటాళ్లు, నల్లరేగడి భూముల్లో సాగు చేసిన బ్యారన్‌కి 35.50 క్వింటాళ్లు పొగాకు అమ్మకాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. 2,764 పొగాకు బ్యారన్లకు చెందిన 45 గ్రామాల్లోని 3950 మంది రైతులు తమ పొగాకును ఈ ఏడాది కొండపి పొగాకు వేలంకేంద్రంలో అమ్ముకోవడానికి అవకాశం ఉంది. పొగాకు బోర్డు రైతులకు ఇచ్చిన 6,400 హెక్టార్ల సాగుకు మించి రైతులు ఎక్కువగా సాగు చేసినట్లు తెలిపారు. రైతులు పండించిన పొగాకును బయట మార్కెట్‌లో ఎట్టి పరిస్థితుల్లో అమ్ముకోవద్దని తెలిపారు. అనుమతి ఉన్న రైతులు తమ చివరి కేజీ వరకు పొగాకు బోర్డులోనే అమ్ముకోవాలని సూచించారు. బయట మార్కెట్‌లో పొగాకు అమ్ముకోవటం వలన రైతులకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా పొగాకు బయట అమ్మినా..కొన్నా రైతులు తమ దృష్టికి తీసుకువస్తే అక్రమ కొనుగోలుదారులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలిరోజు జువ్విగుంట క్లష్టర్‌తో ఉదయం 10.50 గంటలకు పొగాకు కొనుగోళ్లు ప్రారంభమౌతాయని తెలిపారు. తొలిరౌండ్ అమ్మకాలకు సంబంధించి బ్యారన్‌కి 4 బేళ్లు అనుమతి ఇస్తున్నట్లు వేలంకేంద్రం అధికారి తెలిపారు. రైతులు పొగాకు సగటు ధర కేజీ రూ.200 దక్కేలా చూడాలని బోర్డు అధికారులను, వ్యాపారులను కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ పనుల అడ్డగింత

ఉలవపాడు: మండల పరిధిలోని మన్నేటికోటలో నిర్మాణంలో ఉన్న 132 కెవీ సబ్‌స్టేషన్ పనులను బుధవారం మన్నేటికోట గ్రామస్తులు అడ్డుకున్నారు. నాలుగేళ్లుగా పనులు ప్రారంభించిన ప్రతిసారీ అడ్డుకుంటున్నారు. సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పలుమార్లు గ్రామసభలు నిర్వహించారు. అయినా సయోధ్య కుదరలేదు. బయట నుంచి లైన్లు లాగడం దాదాపు 70 శాతం పూర్తయింది. కేవలం సబ్‌స్టేషన్ నిర్మాణం మాత్రమే జరగాలి. ఈ పరిస్థితుల్లో విద్యుత్ శాఖ నిర్మాణ పనులు జరిగేలా కోర్టు ఆర్డర్ తీసుకుని పోలీస్ శాఖ సహకారంతో పనులు ప్రారంభించడానికి బుధవారం జేసీబీతో గుంతలు తీయడం ప్రారంభించారు. గ్రామస్తులు పనులు చేయడానికి ఒప్పుకోమని జేసీబీకి అడ్డంగా కూర్చున్నారు. కందుకూరు డీఎస్పీ కండేశ్రీనివాసులు, కందుకూరు, గుడ్లూరు సీఐలు వెంకటరావు, సుబ్బారావు, తహసీల్దార్ మహ్మద్ హుసేన్‌లు గ్రామస్తులకు నచ్చచెప్పాలని ప్రయత్నించినా వారు ఒప్పుకోలేదు. ఈ స్థలంలో కాకుండా వేరే స్థలంలో నిర్మించాలని కోరగా స్థలం మార్చడం కుదరదని విద్యుత్ శాఖ అధికారులు తేల్చి చెప్పారు. అటు అధికారులు, ఇటు గ్రామస్తులు నిర్మాణ స్థలంలోనే కూర్చుని ఉన్నారు. పనులు నిలిచి పోయాయి. పోలీసులు నిర్మాణ స్థలంలో వివాదాలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

క్లౌడ్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు

ఒంగోలు టౌన్: క్లౌడ్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే మంచి అవకాశాలను చేజిక్కించుకోవచ్చని ఎడ్యుస్కిల్ అసిస్టెంట్ డైరక్టర్ వివేక్ రంజన్ చెప్పారు. బుధవారం స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎడ్యుస్కిల్, ఏడబ్లూస్ సంయుక్త ఆధ్వర్యంలో టెక్ క్యాంప్ విద్యార్థులకు నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన పాల్గొన్నారు. క్లౌడ్ టెక్నాలజీని వివిధ రంగాల్లో ఉపయోగిస్తున్నారని ఏడబ్ల్యూస్ ప్రోగ్రాం సీనియర్ మేనేజర్ అభీర్ నాయక్ వివరించారు. నైపుణ్యం కలిగిన శిక్షకులచే రెండు రోజులపాటు వర్క్ షాపు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. క్లౌడ్ టెక్నాలజీకి సంబంధించిన సర్టిఫికేషన్, ఉద్యోగం, ఎంట్రప్రెన్యూర్‌గా పనిచేసేందుకు పలు సాంకేతిక అంశాలను చర్చించినట్లు ఆయన వివరించారు.



మాట్లాడుతున్న ఎడ్యుస్కిల్ అసిస్టెంట్ మేనేజర్

ప్రతినిధి చీమకుర్తి దీప్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.కె మూర్తి, డీన్ రూప అక్కేష్, ఎడ్యుస్కిల్ కో ఆర్డినేటర్ కె.రాజ్ కిరణ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ వైష్ణవి పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్లతో మూగజీవాలకు రక్షణ

మద్దిపాడు: గొర్రెల పెంపకం దారులకు మద్దిపాడు ఏడీ రామారావు ఆధ్వర్యంలో బూరేపల్లి పునరావాస కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ బేబీరాణి ప్రసంగించారు. గొర్రెల పెంపకందారులు జాతీయ రహదారులు దాటే క్రమంలో అజాగ్రత్తగా ఉంటున్నారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెంపకం దారులు వెలుతురు ఉన్న సమయంలోనే రహదారులు దాటాలని, ఒకవేళ రాత్రి సమయం అయితే కర్రలకు రేడియం స్టిక్కర్లు అంటించుకోవాలని తెలిపారు. రాత్రి సమయాల్లో ప్రయాణించాల్సి వస్తే మందలోని మేకలు, పొట్టేళ్ల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అంటించుకుని వెళ్లాలలని సూచనలు చేశారు. డీడీ రమేష్, పశువైద్య శాఖ సిబ్బంది గ్రామ నాయకులు రమేష్, వెంకటాద్రి పలువురు గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ బేబీరాణి, డీడీ రమేష్, ఏడీ రామారావు

త్రిపురాంతకేశ్వస్వామి ఆదాయం రూ.18.98 లక్షలు

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం, బాలత్రిపురసుందరీదేవి అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. రెండు నెలల మూడు రోజులు త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం ద్వారా రూ.9,22,160 లక్షలు, బాలత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయం ద్వారా రూ.9,76,701 లక్షలు మొత్తం రూ.18,98,861 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ డీ అనిల్‌కుమార్, చైర్మన్ పబ్బిశెట్టి పద్మజా మల్లికార్జునరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, బాలత్రిపురసుందరీ సేవా సమితి, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

బృంగీశ్వర వాహనంపై ఆదిదంపతులు



మార్కాపురం టౌన్: మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శివాలయంలో స్వామి వారు బుధవారం జఠారుఘూటం అలంకారంపై పార్వతీ పరమేశ్వరులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం రుద్రాభిషేకం, అమ్మవారికి అర్చన చేశారు. నాలుగు మాడ వీధుల్లో స్వామి వారి ఉరేగింపులో భక్తులు పాల్గొన్నారు. శివాలయంలో బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. చైర్మన్ వి.కేశవరావు, ఈఓ చెన్నకేశవరెడ్డి, సాయిబాబా మందిరం ఫౌండర్ గోపాలుని హరిహరరావు, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావు, ధర్మకర్తలు, శేషగిరిరావు, అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



యజ్ఞ హోమాలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు



భక్తులకు అన్నదానం

చీమకుర్తి: రామ్‌నగర్‌లోని సీతారామస్వామి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని సీతారామస్వాములకు విశేష పూజలను నిర్వహించారు. యజ్ఞ హోమాలను ఏర్పాటు చేసి స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వేదపండితులు భక్తులకు దర్శనం కల్పించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో దాదాపు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



డీఆర్‌ఓకి వినతి పత్రం ఇచ్చి వివరిస్తున్న దాసరి రవి



కర్నూల్ రోడ్డును ఆనుకొని ప్రభుత్వ భూమిని ఆక్రమించి లే అవుట్ వేసిన ప్రాంతం

చీమకుర్తి: కర్నూల్ రోడ్డు ఫేసింగ్‌లోని విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందని యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ దాసరి రవి జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసుకు బుధవారం వినతిపత్రం అందించారు. సంతనూతలపాడు మండలం పి. గుడిపాడు పంచాయతీలోని సర్వే నంబర్ 16/బీలో 2.30 ఎకరాల ప్రభుత్వ భూమి కర్నూల్ రోడ్డు ఫేసింగ్‌లో ఉందన్నారు. దానిని కొంతమంది ఆక్రమించుకొని లేవుట్‌లను వేసి ప్లాట్ల రూపంలో విక్రయించుకుంటున్నారని డీఆర్‌ఓ దృష్టికి తీసుకొచ్చారు. ఆ విషయంపై సంతనూతలపాడు తహసీల్దార్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామని డీఆర్‌ఓ వివరించామన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

తాళ్లూరు: స్థానిక మండల మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సహకారంతో కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు.

పోటీతత్వం అలవరచుకోవాలి

ఒంగోలు టౌన్: ప్రస్తుత సమాజంలోని అన్ని రంగాల్లోనూ ఉన్న పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థినులు కాలేజీ నుంచే పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు చెప్పారు. స్థానిక సాయిరాం జూనియర్ కళాశాల 7వ వార్షికోత్సవంలో మాట్లాడారు. ఇష్టపడి చదివితే కష్టసాధ్యమైన లక్ష్యాలను కూడా సులువుగా అధిగమించవచ్చన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలని ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు అన్నారు. ఇంటర్‌మీడియెట్ కళాశాల ఆర్జేడీ సుబ్బారావు, ఆర్ఐఓ విక్టర్ పాల్, ప్రిన్సిపాల్ కె.అంజయ్య, చైర్మన్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ప్రజాస్వామ్య ఉద్యమమే లక్ష్యం

నాగులుప్పలపాడు: ఎస్సీలవర్గీకరణే లక్ష్యంగా ఈదుమూడి కేంద్రంగా ఏర్పడిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో నియంతృత్వ పోకడలకు స్థానం లేదని పలువురు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు తెలిపారు. ఉద్యమంలో దశాబ్దాలుగా పనిచేస్తూ అవమానాలు పొంది, జైళ్లకు వెళ్లి, కేసులు పెట్టించుకున్న తమపై వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పెత్తనం, పొగపెట్టి సాగనంపడం వంటి చర్యలు ఏమాత్రం సరికాదని రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. బుధవారం సాయంత్రం ఈదుమూడి గ్రామంలో రాష్ట్ర, జిల్లా నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బెంగళూరు సభ దగ్గరి నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను నాయకులకు వివరించారు. బ్రహ్మయ్య మాదిగతో ఏకీభవించిన నాయకులు ఇకపై కృష్ణ మాదిగతో కలిసి పనిచేసేది లేదని ఆంధ్రప్రదేశ్‌లో బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలోనే పనిచేస్తామని తెలియజేశారు. నాగేశ్వరరావు, షాలేమ్ రాజు, చిరంజీవి, గరటయ్యతో పాటు జిల్లా నాయకత్వం, పలు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆటో-బైక్ ఢీ, ఇద్దరికి గాయాలు

కారంచేడు: ఆటో-బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈఘటన వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. స్వర్ణ గ్రామానికి చెందిన వెంకటేష్, సాయిలు బైక్‌పై కారంచేడు నుంచి పర్చూరు వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో ఆటో పర్చూరు నుంచి కారంచేడు వైపు వస్తోంది. వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు-చీరాల మధ్యన వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలోకి రాగానే ఆటో, బైక్ ఢీకొట్టుకున్నాయి. దీంతో బైక్ మీద ఉన్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో చీరాల ఆసుపత్రికి తరలించారు.

27న విశ్రాంత ఉద్యోగుల సంఘ ఎన్నికలు

మార్కాపురం టౌన్: మార్కాపురం విశ్రాంత ఉద్యోగుల సంఘ ఎన్నికను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఐ.బాలసుబ్బారావు, టి. జయరామ్ తెలిపారు. ఎన్నికల అధికారిగా టీసీహెచ్ సుబ్బారావును, సహాయ ఎన్నికల అధికారిగా ఎం.భాస్కర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. నామినేషన్ 27 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల్లోపు వేయాలని సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలు నియంత్రించొచ్చు

ముండ్లమూరు: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలను నియంత్రించవచ్చని ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం సర్పంచ్‌లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రధాన ప్రదేశాలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగ పడతాయన్నారు. వెంటనే నిందితులను గుర్తించవచ్చన్నారు. పంచాయతీ నిధుల నుంచి అవసరమైన చోట సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్‌లు వేముల పద్మావతి శ్రీనివాసరావు, నలమోలు వెంకటేశ్వర్లు, చొప్పరపు వెంకటేశ్వర్లు, కందిమల్ల గీతాంజలి, గజ్జల సుబ్బారెడ్డి, ఆదెమ్మ పాల్గొన్నారు.